పద్దుకు వేళాయెరా..

రేపే కేంద్ర బడ్జెట్ • టాప్-10 అంచనాలివే

న్యూఢిల్లీ, జనవరి 30: మరికొద్ది గంటల్లో కేంద్ర బడ్జెట్ ఆవిష్కృతం కానున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను పార్లమెంట్‌లో శనివారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. ఎప్పట్లాగే ఈసారీ సమాజంలోని ఆయా వర్గాలు, ముఖ్యంగా మధ్యతరగతి ప్రజానీకం, సగటు ఉద్యోగులు పద్దుపై బోలెడు ఆశలు, అంచనాలు పెట్టుకున్నారు. ప్రధానంగా వ్యక్తిగత ఆదాయ పన్నుకు సంబంధించి ఊరటనివ్వాలని పెద్ద ఎత్తున కోరుతున్నారు. మరి వాటిని మోదీ సర్కారు ఏ మేరకు నెరవేరుస్తుందో చూడాలి. ఇక రాబోయే బడ్జెట్‌పైనున్న టాప్-10 అంచనాలివే..

ఐటీ శ్లాబులు-రేట్లు

కొత్త, పాత వ్యక్తిగత ఆదాయ పన్ను (ఐటీ) విధానాల్లో శ్లాబులు, రేట్లను మార్చాలని ట్యాక్స్‌పేయర్స్ కోరుకుంటున్నారు. అయితే ఐదేండ్ల కిందట కొత్త ఆదాయ పన్ను విధానాన్ని తీసుకొచ్చిన మోదీ సర్కారు.. అప్పట్నుంచి పాత ఆదాయ పన్ను విధానం జోలికే వెళ్లడం లేదు. కొత్త విధానాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చడానికే ప్రతీ బడ్జెట్‌లో సవరణలు చేస్తూ వస్తున్నది. దీంతో ఈసారి కొత్తదానిలో వార్షిక ఆదాయం రూ.20 లక్షలు, అంతకుమించి ఉంటేనే 30 శాతం పన్ను వేయాలన్న డిమాండ్లు భారీగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రూ.15 లక్షలు దాటితే 30 శాతం పన్ను పడుతున్నది. అలాగే రూ.12-15 లక్షల శ్లాబుపై వర్తిస్తున్న 20 శాతం పన్నును 15 శాతానికి కుదించి.. కొత్తగా రూ.10-15 లక్షల శ్లాబును తీసుకురావాలని కోరుతున్నారు.

స్టాండర్డ్ డిడక్షన్

కొత్త ఆదాయ పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్‌ను లక్ష రూపాయలకు పెంచాలని పన్ను చెల్లింపుదారులు కోరుతున్నారు. పెంచితే మరింత మంది ట్యాక్స్‌పేయర్స్ కొత్త విధానంలోకి వచ్చే వీలుందని నిపుణులూ చెప్తున్నారు. ఇక కిందటి బడ్జెట్‌లో రూ.50వేల నుంచి రూ.75వేలకు పెంచిన విషయం తెలిసిందే. మరోవైపు పాత పన్ను విధానంలోనూ స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.75వేలకు పెంచాలన్న డిమాండ్లు వస్తున్నాయి.

పన్ను మినహాయింపు

కొత్త ఆదాయ పన్ను విధానంలో ఇప్పుడు వార్షిక ఆదాయం రూ.3 లక్షలదాకా ఉంటే ఎలాంటి పన్ను లేదు. అయితే దీన్ని రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక పాత ఆదాయ పన్ను విధానంలోనూ ఈ పన్ను మినహాయింపు పరిమితిని ప్రస్తుతమున్న రూ.2.5 లక్షల నుంచి 3 లక్షలకు పెంచాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

ఆదాయ పన్ను రిబేటు

ప్రస్తుతం వ్యక్తిగతంగా పన్ను సహిత ఆదాయం ఏటా రూ.7 లక్షలదాకానే ఉంటే పూర్తిగా ట్యాక్స్ రిబేటుకు వీలుంటున్నది. అయితే దీన్ని ఈసారి బడ్జెట్‌లో రూ.10 లక్షలకు పెంచాలని ట్యాక్స్‌పేయర్స్ కోరుతున్నారు. కొత్త ఆదాయ పన్ను విధానంలో రావాలని కోరుతున్న ఈ మార్పుతో మధ్యతరగతి వర్గాలకు పెద్ద ఊరట లభిస్తుందని చెప్తున్నారు. వినిమయ శక్తి కూడా పెరిగి మార్కెట్‌కు కొత్త ఉత్సాహం వస్తుందనీ నిపుణులు పేర్కొంటున్నారు.

సెక్షన్ 80సీ

కొత్త ఆదాయ పన్ను విధానంలోనూ పొదుపు, పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80సీ ప్రయోజనాలను తేవాలని పలువురు ఎక్స్‌పర్ట్స్ సూచిస్తున్నారు. ప్రస్తుతం పాత ఆదాయ పన్ను విధానంలో సెక్షన్ 80సీ కింద ఏటా గరిష్ఠంగా రూ.1.5 లక్షలదాకా పన్ను మినహాయింపులను ట్యాక్స్‌పేయర్స్ క్లెయిం చేసుకోవచ్చన్న సంగతి విదితమే. ఇదిలావుంటే దీన్ని రూ.2 లక్షలకు పెంచాలని పాత ఆదాయ పన్నును ఎంచుకొంటున్నవారూ డిమాండ్ చేస్తున్నారు.

ఎన్‌పీఎస్‌కు ప్రోత్సాహకాలు

నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)ను మరింత మంది ఎంచుకొనేలా ఈ బడ్జెట్‌లో పలు నిర్ణయాలు, ప్రోత్సాహకాలు ఉండొచ్చని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనికి పూర్తిగా పన్ను మినహాయింపును కల్పించవచ్చని, పాత ఆదాయ పన్ను విధానంలో ఉన్నట్టుగానే.. కొత్త ఆదాయ పన్ను విధానంలోనూ ఎన్‌పీఎస్‌కు రూ.50వేలదాకా అదనపు పన్ను ప్రయోజనాలను కల్పించవచ్చని చెప్తున్నారు.

హెచ్‌ఆర్‌ఏ ప్రయోజనాలు

మెట్రోపాలిటన్ ప్రాంతాలకుతోడు ద్వితీయ శ్రేణి నగరాల్లో ఉంటున్నవారికీ హౌజ్ రెంట్ అలవెన్స్ (హెచ్‌ఆర్‌ఏ) ప్రయోజనాలు అందేలా ఈసారి బడ్జెట్‌లో చర్యలుంటాయని అంచనా. బేసిక్ సాలరీలో 40 శాతానికి బదులుగా 50 శాతానికి హెచ్‌ఆర్‌ఏ మినహాయింపుల్ని పెంచవచ్చని చెప్తున్నారు.

సెక్షన్ 80డీ

పెరిగిన ఖర్చుల దృష్ట్యా ఆరోగ్య బీమా ప్రీమియంలూ పెరిగిపోతున్నాయి. సమగ్ర కవరేజీ కోసం మరింత ఖర్చు చేయాల్సిన పరిస్థితి పాలసీదారులకు వచ్చింది. దీంతో కొత్త ఆదాయ పన్ను విధానంలో ఆరోగ్య బీమా కోసం చేసే ప్రీమియం చెల్లింపులపై ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80డీ కింద ఉండే ప్రయోజనాలను వర్తింపజేయాలని కోరుతున్నారు.

సెక్షన్ 80జీ/80టీటీఏ

స్వచ్ఛంధ సంస్థలకు విరాళాలు పెరిగేలా, బ్యాంకుల్లో పొదుపును ప్రోత్సహించేలా ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80జీ/సెక్షన్ 80టీటీఏ ప్రయోజనాలను కొత్త ఆదాయ పన్ను విధానంలోనూ అమలుపర్చవచ్చని అంచనా.

గృహ రుణగ్రహీతల కోసం..

నిర్మాణ రంగానికి ఊతమిచ్చేలా స్థిరాస్తి కొనుగోలుదారులకు వివిధ రకాల పన్ను ప్రయోజనాలను బడ్జెట్‌లో ప్రకటిస్తారని అంచనాలున్నాయి. ఇందులో భాగంగానే గృహ రుణగ్రహీతలకు అసలు, వడ్డీ చెల్లింపులపై పన్ను మినహాయింపులను పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఏటా రూ.2 లక్షలదాకా పన్ను ప్రయోజనాలను ట్యాక్స్‌పేయర్స్ క్లెయిం చేసుకోవచ్చు. అయితే దీన్ని రూ.3 లక్షలకు పెంచవచ్చని అంటున్నారు. అలాగే ఆదాయ పన్ను రిటర్ను (ఐటీఆర్)ల ప్రక్రియను మరింత సులభతరం చేయవచ్చని కూడా చెప్తున్నారు.

చివరగా..

ప్రస్తుతం దేశంలోని ట్యాక్స్‌పేయర్లలో 78 శాతం కొత్త ఆదాయ పన్ను విధానాన్నే ఎంచుకుంటున్నారు. దీంతో పాత ఆదాయ పన్ను విధానాన్ని కోరుకుంటున్న ఆ మిగతా 22 శాతం మందినీ కొత్త విధానంలోకే తెచ్చేందుకు ఈసారీ పాత విధానంలో ఎలాంటి మార్పులు చేయకపోవచ్చని, కొత్త దానిలోనే సవరణలు చేస్తారన్న అంచనాలు నిపుణుల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో మున్ముందు పాత పన్ను విధానాన్ని పూర్తిగా ఎత్తేసే వీలు కూడా లేకపోలేదన్న అభిప్రాయాలను వారు వ్యక్తం చేస్తుండటం గమనార్హం. కేవలం పాత ఆదాయ పన్ను విధానంలోనే వివిధ సెక్షన్ల కింద రకరకాల ఆదాయ-వ్యయాలకు, పెట్టుబడులు-పొదుపులకు ఇప్పుడు ట్యాక్స్‌పేయర్స్ పన్ను మినహాయింపులను కోరే వెసులుబాటు ఉంటున్న సంగతి విదితమే.



బడ్జెట్ కూర్పులో నిర్మల టీం ఇదే..

వీ అనంత నాగేశ్వరన్: ఐఐఎం అహ్మదాబాద్ పూర్వ విద్యార్థి. భారత ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారుగా పనిచేస్తున్నారు.

మనోజ్ గోవిల్: ఐఐటీ కాన్పూర్ పూర్వ విద్యార్థి. మధ్యప్రదేశ్‌కు చెందిన 1991 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. కేంద్ర వ్యయ కార్యదర్శిగా ఉన్నారు.

అజయ్ సేథ్: ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి. బడ్జెట్ డాక్యుమెంట్లకు తుదిరూపునివ్వడంలో నేర్పరి.

తుహిన్ కాంత పాండే: ఆర్థిక, రెవిన్యూ కార్యదర్శి. ఒడిషా కేడర్ ఐఏఎస్ అధికారి.

అరుణిష్ చావ్లా: ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ, పెట్టుబడుల శాఖ కార్యదర్శి. బీహార్ కేడర్ ఐఏఎస్ అధికారి.

ఎం నాగరాజు: త్రిపురకు చెందిన 1993 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఆర్థిక సేవల కార్యదర్శిగా ఉన్నారు.

ఫెడ్ వడ్డీరేట్లు యథాతథం

వాషింగ్టన్, జనవరి 30: వరుసగా వడ్డీరేట్లను తగ్గించుకుంటూ వచ్చిన అమెరికా ఫెడరల్ రిజర్వు ఈసారి రేట్లను యథాతథంగా ఉంచింది. ద్రవ్యోల్బణ గణాంకాలు పుంజుకుంటుండటం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాలసీల ప్రభావంతో వేచి చూసేదోరణిలో అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఈసారి రేట్లను యథాతథంగా ఉంచడానికి మొగ్గుచూపింది. గడిచిన ఏడాదికాలంలో రేట్లను 5.3 శాతం నుంచి 4.3 శాతానికి దించింది.

బీవోబీ లాభం 4,837 కోట్లు

న్యూఢిల్లీ, జనవరి 30: ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.4,837 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.4,579 కోట్ల లాభంతో పోలిస్తే 5.6 శాతం వృద్ధి కనబరిచినట్లు వెల్లడించింది. సమీక్షకాలంలో బ్యాంక్ రూ.34,676 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.31,416 కోట్లతో పోలిస్తే 10 శాతం వరకు పెరిగింది. దీంట్లో వడ్డీల ద్వారానే రూ.30,908 కోట్ల ఆదాయం సమకూరింది. గత త్రైమాసికంలో బ్యాంక్ ఆపరేటింగ్ ప్రాఫిట్ రూ.7,015 కోట్ల నుంచి రూ.7,664 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్‌ఈకి సమాచారం ఇచ్చింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 3.08 శాతం నుంచి 2.43 శాతానికి దిగిరాగా, నికర ఎన్‌పీఏ 0.7 శాతం నుంచి 0.59 శాతానికి దిగొచ్చింది. అయినప్పటికీ మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ గత త్రైమాసికంలోనూ రూ.1,082 కోట్ల నిధులు వెచ్చించింది.

దొడ్ల డెయిరీ 280 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, జనవరి 30: ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ దొడ్ల డెయిరీ లిమిటెడ్ అంచనాలకుమించి రాణించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను రూ.63.56 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.41.33 కోట్లతో పోలిస్తే 54 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. కంపెనీ ఆదాయం రూ.752.5 కోట్ల నుంచి రూ.912.20 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది. వ్యాపార విస్తరణలో భాగంగా రూ.280 కోట్ల పెట్టుబడితో మహారాష్ట్రలో నూతన పాల శీతలీకరణ ప్లాంట్‌ను నెలకొల్పబోతున్నట్లు కంపెనీ ఎండీ దొడ్ల సునీల్ రెడ్డి తెలిపారు. ఈ నిధులను కంపెనీ అంతర్గత వనరుల ద్వారా సేకరిస్తున్నట్లు, అలాగే రోజుకు 17.1 లక్షల లీటర్ల పాలను రైతుల నుంచి సేకరించి ప్రాసెసింగ్ చేస్తున్నట్లు చెప్పారు.

ఇప్పట్లో 'బిల్డ్ నౌ' పోర్టల్ లేనట్టే!

అందుబాటులోకి రాని సాఫ్ట్‌వేర్ • పాత విధానంలోనే 'రియల్' అనుమతులు

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): రియల్ అనుమతులు పొందడం ఇక సులభతరమే అని ఆశలు పెట్టుకున్న వ్యాపారులకు నిరాశే దక్కింది. ప్రభుత్వం ప్రకటించిన బిల్డ్ నౌ పోర్టల్‌కు ఆటంకాలు మొదలయ్యాయి. కొత్త పోర్టల్‌కి సంబంధించిన సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి రాలేదని తెలిసింది. ఎప్పుడు అందుబాటులోకి వస్తుందన్న అంశంపైనా క్లారిటీ లేకుండా పోయింది. దీంతో వ్యాపారస్తులు పాత విధానంలోనే దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది.

కనిపించని చిత్తశుద్ధి..

'బిల్డ్ నౌ' పేరిట కొత్త పోర్టల్ విధానాన్ని ఫిబ్రవరి 1నుంచి అమల్లోకి తీసుకువస్తున్నట్టు స్వయంగా మంత్రి శ్రీధర్‌బాబు గత నెల మొదటి వారంలో అధికారికంగా ప్రకటించారు. కానీ ఆ మేరకు చర్యలు తీసుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నట్టు కనిపించటంలేదు. రియల్ అనుమతుల కోసం జీహెచ్‌ఎంసీ, మున్సిపాలిటీ, డీటీసీపీ వంటి విభాగాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఏఐ సహకారంతో బిల్డ్ నౌ పోర్టల్ విధానాన్ని తెరపైకి తెచ్చారు. కానీ, సంస్థల నుంచి అనుమతులు పొందడంతోపాటు అధికారులు ఏ విధంగా దరఖాస్తులు స్వీకరించి, అనుమతులు మంజూరు చేయాలన్న అంశాలపై ఇప్పటికీ శిక్షణ ఇవ్వలేదు.

ఎన్ఎల్‌సీ ప్రాజెక్టులపై కిషన్‌రెడ్డి సమీక్ష

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్ఎల్‌సీ) ప్రాజెక్టులపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 2047 నాటికి వికసిత్ భారత్‌గా అభివృద్ధి చేయాలన్న ప్రధాని మోదీ విజన్‌లో భాగంగా కేంద్ర బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖలో పలు సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. ఒడిశాలోని తాలాబిరా, మచ్చకట పాత్రపారాల్లో.. జార్ఖండ్‌లోని సౌత్ పచ్వారా, నార్త్ దాదుల్లో బొగ్గు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు ఎన్ఎల్‌సీ ద్వారా విశేషమైన కృషి జరుగుతుందన్నారు. ఎన్ఎల్‌సీలో పని చేసే కార్మికులు, ఉద్యోగులకు ప్రమాద బీమా వర్తించేలా పరిశీలించాలని సూచించారు

మృతుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కృష్ణకాలనీ, జనవరి 30 : మున్సిపల్ పరిధి 15వ వార్డు కాకతీయ కాలనీకి చెందిన రేణిగుంట నరేశ్‌కుమార్ ఇటీవల మృతి చెందగా గురువారం బీఆర్ఎస్ నాయకులు కోల రాయమల్లు, మోకిడి అశోక్ ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి 25 కిలోల బియ్యం, ఆర్థిక సాయం అందజేశారు. బీఆర్ఎస్ నాయకుడు రవి, టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రేణిగుంట్ల మహేశ్ ఉన్నారు. అలాగే టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య మాదిగ ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట నర్సయ్య మాదిగ, టీఎస్ ఎమ్మార్పీఎస్ నాయకులు కోడెపాక సంజీవయ్య, పెండెల దేవరాజ్, పుల్ల సతీశ్, బచ్చల చిరంజీవి, పొట్ట పోషయ్య, శీలపాక హరీశ్, ఈర్ల చిన్న, మంత్రి రాజబాబు, ఆతుకూరి శంకర్ పాల్గొన్నారు.

అక్రమ పట్టాలపై తహసీల్దార్‌కు వినతి

మహాముత్తారం, జనవరి 30 : మండలంలోని పెగడపల్లి, ప్రేమ్‌నగర్ గ్రామంలో సర్వే నంబర్లు 108,109 భూములపై ప్రజా సంఘాల నాయకులు తహసీల్దార్ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాస్తులో ఉన్న రైతులకు పట్టాలు ఇవ్వకుండా సాగులో లేని వారికి పట్టాలు ఇచ్చారని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. గతంలో కలెక్టర్, తహసీల్దార్‌కు వినతిపత్రాలు ఇచ్చినా న్యాయం జరగలేదు అని తెలిపారు. కొందరు నాయకులు భూములు లేకున్నా ఎక్కువ భూములు నమోదు చేసుకున్నారని తెలిపారు. ఇతర జిల్లాల వారికి సైతం పట్టాలు జారీ అయ్యాయన్నారు. వీరిని తొలగించి శాటిలైట్ ద్వారా కాస్తులో ఉన్న వారిని గుర్తించి కొత్త పట్టాలు జారీ చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎంఎస్పీ మండల అధ్యక్షుడు పులియాల రాజయ్య, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు రామగిరి రాజు, మండల ప్రధాన కార్యదర్శి పులియాల సురేశ్, ఎమ్మార్పీఎస్ నాయకులు పుల్యాల రాజు ఉన్నారు.

'లక్ష డప్పులు, వెయ్యి గొంతుకలు' సభకు కదం తొక్కండి

మొగుళ్లపల్లి/ చిట్యాల, జనవరి 30 : ఫిబ్రవరి 7న తలపెట్టిన 'లక్ష డప్పులు.. వెయి గొంతులు' కార్యక్రమానికి మాదిగలు తరలిరావాలని మాదిగ కళాకారుల సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ మిట్టపల్లి సురేందర్ అన్నారు. గురువారం మొగుళ్లపల్లి, చిట్యాల మండలకేంద్రాల్లో ఆయన నాయకులతో కలిసి వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఉమ్మడి రిజర్వేషన్ ఫలాలను ఒక సామాజికవర్గం వారే లబ్ధి పొందుతూ వచ్చారన్నారు. కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పుల్ల శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పుట్ట భిక్షపతి, మాదిగ యువసేన స్టేట్ ప్రెసిడెంట్ ఏకు శంకర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కోకిల రవి మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు నేరెళ్ల ఓదెలు, చిట్యాల మండల అధ్యక్షుడు దొడ్డి శంకర్, మండల ప్రధాన కార్యదర్శి కటుకూరి మొగలి, జిల్లా నాయకుడు జేరిపోతుల ఓదెలు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి : సభ వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మిట్టపల్లి సురేందర్

గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలు

- మినీ జాతర ఏర్పాట్ల పరిశీలన
- సమస్యల పరిష్కారానికి చర్యలు
- ములుగు కలెక్టర్ దివాకర

ఏటూరునాగారం/కన్నాయిగూడెం, జనవరి 30 : గిరిజన గ్రామాల్లో మెరుగైన వైద్యసేవలు అందించడంతో పాటు సమస్యలు పరిష్కరించనున్నట్లు కలెక్టర్ టీ ఎస్ దివాకర అన్నారు. కొండాయి, దొడ్ల, ఐలాపూర్ గ్రామాలను గురువారం ఆయన సందర్శించారు. మినీ జాతర సందర్భంగా మంజూరు చేసిన పనులను పరిశీలించారు. టాయిలెట్ బ్లాక్‌లు, జాతర నిర్వహణ పనులు, పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులు, ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొండాయి, ఐలాపూర్‌లోని సమ్మక్క-సారలమ్మను దర్శించుకున్నారు. ఐలాపూర్‌లో జాతరకు సంబంధించిన ఆహ్వాన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ గిరిజన గ్రామాల ప్రజలకు సత్వర వైద్యం అందించేందుకు వైద్య శిబిరాలు నిర్వహించడమే కాకుండా ప్రత్యేక అంబులెన్స్‌లను 24గంటల పాటు అందుబాటులో ఉంచుతామన్నారు. ఫిబ్రవరి 12నుంచి కొండాయిలో జరిగే జాతరకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. పాఠశాలలను సందర్శించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందజేయాలని అధికారులను ఆదేశించారు. గవర్నర్ దత్తత తీసుకున్న తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామాన్ని సందర్శించారు. దత్తత గ్రామంపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట గిరిజన సంక్షేమశాఖ ఈఈ వీరభద్రం, తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీవో కుమార్, ఆయా శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం : దొడ్లలో పర్యటిస్తున్న కలెక్టర్ దివాకర

నియామక పత్రాన్ని అందజేస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్

బీఆర్ఎస్ ఏలేటిరామయ్యపల్లి గ్రామ కమిటీ ఎన్నిక

చిట్యాల, జనవరి 30 : మండలంలోని ఏలేటిరామయ్యపల్లి బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడిగా నరిగ అశోక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్ తెలిపారు. కాగా, ఉపాధ్యక్షులుగా తుమ్మ మహేందర్, ఏలేటి వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా గొర్రె రాజయ్య, కార్యదర్శిగా కంచు రవీందర్, కోశాధికారిగా ఉమ్మనవేని రాజు, కార్యవర్గ సభ్యులుగా కొత్తూరు మహేందర్, ఏలేటి సురేందర్, ఉమ్మనవేన రాజయ్య, కొత్తూరు కొండల్ రెడ్డి, యూత్ కమిటీ అధ్యక్షుడు ఉమ్మనవేణన కుమార్, ఉపాధ్యక్షుడిగా కంచు మహేశ్, ప్రధాన కార్యదర్శిగా కొడారి బాలకృష్ణను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పిట్ట సురేశ్, మండల ప్రధాన కార్యదర్శి ఏరుకొండ రాజేందర్ గౌడ్, మడికొండ రవీందర్, యూత్ మండల అధ్యక్షుడు టౌటం నవీన్, ఏలేటి రాజు, మర్రి నరేశ్, మార్కెట్ మాజీ డైరెక్టర్ దామెర రాజ్, పెరుమాండ్ల రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ అమలుతో ఫ్లెక్సీల తొలగింపు

ఏటూరునాగారం/ వెంకటాపురం (నూగూరు) జనవరి 30 : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఏటూరునాగారం, వెంకటాపురం (నూ) మండలకేంద్రాల్లో గురువారం రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించారు. వాల్‌రైటింగ్స్, బ్యానర్లు, జెండాలు, స్టిక్కర్లు, ఫ్లెక్సీలు తొలగించారు. పలు పార్టీల నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడిగారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వీటిని తొలగించినట్లు పంచాయతీ కారదర్శులు రమాదేవి, ప్రవీణ్ తెలిపారు. శిలాఫలకాలపై తెలుపు వస్త్రాలతో మూసేసినట్లు తెలిపారు.

వెంకటాపురం (నూ) : ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు వేస్తున్న జీపీ సిబ్బంది

అంబటిపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేసిన కేంద్ర బృందం

మహదేవపూర్, జనవరి 30 : మండలంలోని అంబటిపల్లి పీహెచ్‌సీని గురువారం కేంద్ర పాపులేషన్ రీసెర్చ్ సెంబర్ బృందం సభ్యులు తనిఖీ చేశారు. వసతులు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. రికార్డులు, మందుల వివరాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రీసెర్చ్ సెంటర్ బృందం డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ శ్రావణ్, డీపీవో చిరంజీవి, డీడీఎం మధుబాబు, వైద్యులు కళ్యాణి, హెచ్‌ఈవో సోమాజీ, హెల్త్ సూపర్ వైజర్ మాషుక్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

రోగులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

వేతనాలు అందడం లేదని ఎంపీవోకు వినతి

టేకుమట్ల, జనవరి 30 : మూడు నెలలుగా ప్రభుత్వం జీతాలు అందించకపోవడంతో గురువారం ఎంపీవో సురేశ్‌కు ఉపాధి హామీ సిబ్బంది వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. మూడు నెలలుగా జీతాలు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ పోషణ భారంగా ఉందని పిల్లల ఫీజులు, ఈఎంఐలు కట్టలేక ఇబ్బంది పడుతున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ జీతాలను ఇవ్వాలని వారు కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీవో వినీల, ఇన్‌చార్జి ఈసీ, లింగమూర్తి, టీఏలు మానస, వెంకటేశ్, కంప్యూటర్ ఆపరేటర్స్ రఘుపతి, సుస్మిత, ఫీల్డ్ అసిస్టెంట్లు బొజ్జపల్లి శంకర్, భీంపల్లి రామస్వామి, వేముల చంద్రయ్య, జొన్నల శంకర్ పాల్గొన్నారు.

నేటి సంఘీభావ సదస్సును విజయవంతం చేయాలి

ములుగురూరల్, జనవరి 30 : జిల్లా కేంద్రంలో నేడు నిర్వహించే లక్ష డప్పులు వేల గొంతుల సన్నాహక సంఘీభావ సదస్సును విజయవంతం చేయాలని రాష్ట్ర కళా నాయకుడు గొల్కొండ బుచ్చన్న పిలుపునిచ్చారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, సంఘాల ప్రతినిధుల హాజరై మంద కృష్ణ ఆధ్వర్యం లో చేపడుతున్న న్యాయ పోరాటానికి మద్దుతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. కళాకారుడు రాగుల శంకర్‌పటేల్, ఎస్ఎస్పీ నాయకులు శ్యామ్, రవీందర్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

మున్సిపల్ ఆర్ఐ భాస్కర్ బదిలీ

కృష్ణకాలనీ, జనవరి 30 : భూపాలపల్లి మున్సిపాలిటీ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వేల్పుల భాస్కర్‌ను బదిలీ చేస్తూ ఆర్‌డీఎంఏ వరంగల్ రీజినల్ డైరెక్టర్ షాహిద్ మసూద్ ఉత్తర్వులు జారీ చేశారు. సీనియర్ అసిస్టెంట్ హోదాలో పని చేస్తున్న ఆయనను నర్సంపేట మున్సిపాలిటీకి డిప్యూటేషన్‌పై పంపించారు. అయితే ఆయనను ఈనెల 2న బదిలీ చేయగా ఇప్పటి వరకు విధుల్లో నుంచి రిలీవ్ కాలేదు. తాజాగా భూపాలపల్లికి కొత్త కమిషనర్ వచ్చిన వెంటనే ఈ విషయం బయటకు రావడం సర్వత్రా చర్చనియాంశమైంది.

రోడ్